ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 12-7-95 - గురు పూర్ణిమ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు వ్యాస పూర్ణిమ. వ్యాసపూర్ణిమనే పురాతన కాలమునుండి గురుపూర్ణిమగా జరుపుకుంటూ వస్తున్నారు. గురువులకు గురువు, ఋషులకు ఋషి, కవులకు కవి, భారతీయ సాహిత్యమునకు పితామహుడు అయినటువంటి వ్యాసుడు యొక్క జన్మదినమే వ్యాసపూర్ణిమ.

బ్రహ్మదేవుని దగ్గర ఎవరైనా దోషం చేస్తే విష్ణువును దర్శిస్తే అదినశిస్తుంది. విష్ణుదేవుని దగ్గర ఎవరైనా దోషం చేస్తే శివదేవుని దర్శిస్తే అదినశిస్తుంది. శివదేవుని దగ్గర ఎవరైనా దోషం చేస్తే గురువును దర్శిస్తే అది నశిస్తుంది అని చెపుతూవుంటారు. అంటే గురువుకు బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు, శివదేవుడు కంటే ప్రధానమైన స్థానమును ఇచ్చారు.

మనహృదయంలో ఉన్న సత్యవస్తువే నిజమైన గురువు. ఆసత్యవస్తువును సాధించటం కోసం మనం ఎప్పుడైతే మినహాయింపులు లేకుండా ప్రయత్నం చేస్తున్నామో అప్పుడు ఆవస్తువే గురురూపమును ధరించి వస్తుంది. మన మనస్సు బాహ్యముఖమునకు విజృంభిస్తూవుంటుంది. బయట రూపమును ధరించి వచ్చిన గురువు బాహ్యముఖముగా విజృంభిస్తున్న మనస్సును లోపలకు నెట్టుతాడు. నిజమైన గురువు లోపల ఉన్నాడు. బాహ్యగురువు మనస్సును ఎప్పుడైతే లోపలకు నెట్టుతున్నాడో నిజమైన గురువు దానిని లోపలకు గుంజుకుంటాడు.

ఎన్ని శాస్త్రములు చదివినా, ఎన్ని వేదములు చూసినా మనోనిగ్రహము ప్రధానము అని చెప్పారు. మనోనిగ్రహమే ప్రధానము అని చెప్పిన తరువాత కూడ నీ మనస్సును స్వాధీనం చేసుకోవటం కోసం ప్రయత్నం చేయటం మానివేసి అదే పనిగా శాస్త్రములు చదువుతూ ఉంటే పాండిత్యము వస్తుందిగాని నీకు మనోనిగ్రహమురాదు అని భగవాన్ చెప్పారు.

సాధకుల మనస్సును నిర్మలం చేయటంకోసం, నిశ్చల పరచటం కోసం గురువు తదేకంగా ప్రయత్నం చేస్తాడు. మనస్సు నిర్మలం అవ్వాలి. మనస్సు నిర్మలం అవ్వకపోతే గురువు మాటలు శ్రవణం చేసినా, శాస్త్రమును పఠించినా, మహాత్ములను దర్శించినా జ్ఞానము నీకు అంటదు. నిర్మలమైన మనస్సుకు జ్ఞానం అంటుతుంది గాని చపలత్వము ఉన్న మనస్సుకు జ్ఞానం అంటదు. జ్ఞానం కావాలంటే మనస్సు నిర్మలం అవ్వాలి. మనస్సుకు కుదురు రావాలి, దుర్భలత్వం తగ్గాలి. అవసరములేని విషయముల లోనికి మనస్సు వెళుతూఉంటే దుర్భలత్వం ఉన్నట్లు గుర్తు. దుర్భలత్వం ఉంది కాబట్టి మనస్సు ప్రకృతి వైపుకు

విజృంభిస్తోంది. మనస్సు ప్రకృతి గుణాలవైపుకు ప్రయాణిస్తే ప్రకృతి అంటుకుంటుంది. అదే మనస్సు దేవుని వైపుకు ప్రయాణిస్తే జ్ఞానము కలుగుతుంది.

ఏది నిజమో మనకు తెలియకపోయినా మనం పూజించే ఈశ్వరునికి తెలుసు. మనస్సు ఈశ్వరుని వైపుకు పరుగులు తీస్తూ ఉంటే ఆయన స్వరూపమును ఇస్తాడు. ఆయన స్వరూపమే ఆత్మజ్ఞానము. అదే బ్రహ్మము. అదే సత్యము. దానిని ఆయన అనుగ్రహం వలన పొందాలి. దీనికి భగవాన్ 3 మెట్లు చెప్పారు. 1. స్వప్రయత్నం 2. కాలపరిపక్వము 3. ఈశ్వరకటాక్షము. సోమరితనం లేకుండా మనం చేసేప్రయత్నం ఏదోమనం చెయ్యాలి. మనం చేసేపని చిన్నది అయినా గౌరవంగా చెయ్యాలి, ఏకాగ్రంగా చెయ్యాలి, హితవుగా చెయ్యాలి, కపటం లేకుండా చెయ్యాలి. చిన్నపని కదా అని తేలిక భావంతో చేయకూడదు. తిరస్కార బుద్ధి లేకుండా పురస్కారంతో చేయాలి.

నేను అన్నప్పుడు మనకు దేహం జ్ఞాపకం వస్తుంది. ఇంద్రియాలు జ్ఞాపకం వస్తాయి, మనస్సు జ్ఞాపకం వస్తుంది, మనస్సు అనే పెట్టెలోని గొడవలు జ్ఞాపకం వస్తాయి. కృష్ణుడు గీతలో మనకంటే ఎక్కువసార్లు నేను, నేను అని వాడాడు. కాని కృష్ణుడు నేను అన్నప్పుడు విశ్వాత్మభావన, బ్రహ్మభావన, అబేధ భావన స్ఫురిస్తోంది. మనం నేను అన్నప్పుడు దేహమే స్ఫురిస్తుంది. కాని కృష్ణుడు నేను అన్నప్పుడు దేహం స్ఫురించటంలేదు. బ్రహ్మభావన, అఖండభావన స్ఫురిస్తోంది. నేను అన్నప్పుడు కృష్ణుడుకు ఎలా బ్రహ్మ భావన స్ఫురిస్తోందో అలాగ మనకు కూడా నేను అన్నప్పుడు బ్రహ్మం స్ఫురిస్తే ఇప్పుడే ఇక్కడే బ్రహ్మనుభవం కలుగుతుంది. కర్మ సముద్రమును దాటి ఒడ్డుకు రాగలుగుతాము.

గురువు అంటే ఆత్మ. పూర్వజన్మలలో ఏగురువుతో అనుబంధము ఉందోవారి మీద మనకు ఆప్యాయత కలుగుతూ ఉంటుంది. జన్మాంతరములో ఏదో అనుబంధము లేకపోతే మనం ఇప్పుడు ఇలా కూర్చొని మాట్లాడు కోవటం కూడా జరుగదు. ఒకరు భగవాన్‌తో నేను మీ దగ్గరకు చాలా సార్లు వచ్చాను. మీరు నన్ను శిష్యుడు అని అనటంలేదు. ఇంకో గురువును ఎవరినైనా చూసుకోమంటారా అని అడిగారు. నువ్వు ఇంకోచోటగురువును వెతుక్కునే యోగం ఉండి ఉంటే ఇక్కడకు వచ్చి ఉండేవాడివేకాదు అన్నారు భగవాన్. ఈ గేటుద్వారానే మోక్షంను పొందాలి. తాత్కాలికంగా నేను మాట్లాడటంలేదు అని ఎక్కడికైనా వెళ్ళినా ఈ గేటు దగ్గరకు తిరిగి రావలసిందే అన్నారు. అది జన్మాంతర అనుబంధము. ఒకోగురువు ద్వారా కొంత మంది జీవులు తరింపబడతారు. ఇది ఈశ్వరుని యొక్క నియమము.

భగవాన్ప్రాణం పోయేటప్పుడు ప్రయాస ఏమీ కనబడలేదు. శ్వాస వస్తూ ఉంటుంది, వెళుతూ ఉంటుంది కదా. తరువాత వచ్చే శ్వాస రాలేదు అంతే. అప్పుడు ఒక కాంతి బయలుదేరి అరుణగిరిలో అదృశ్యమయింది. జ్ఞానియొక్క ప్రాణం ప్రయాణం చేయదు. దాని మూలంలో మిళితం అవుతుంది అని చెపుతారు. అరుణాచలేశ్వరుడే భగవాన్ రూపములో వచ్చాడు. ఆయనకు ఈయనకు తేడా ఏమిటంటే అది కదలని కొండ, ఈయన కదిలే కొండ. ఆరూపమే ఈ రూపం ధరించి బోధ చేయటంకోసం వచ్చింది. రమణమహర్షి తిరుచ్చుళి నుండి అరుణాచలం వచ్చాడు అని చెపుతారు. అలాకాదు అరుణాచలేశ్వరుడే తిరుచ్చుళి వెళ్ళి మరల అరుణాచలం వచ్చాడు. మనం ఇప్పుడు నర్సాపురంలో ఉన్నాము అనుకోండి. మనం నర్సాపురం నుండి అరుణాచలం వెళ్ళాము అనుకొంటాము. అలాకాదు. మనం అరుణాచలం వాళ్ళమే. అరుణాచలం

నుండి నర్సాపురం వచ్చాము. మరల అరుణాచలం వెళ్ళటానికి ప్రయత్నం చేస్తున్నాము. తిరగబోర్లా వేసుకొంటున్నాము. భగవాన్ యొక్క దేహము పడిపోయే రోజున భగవాన్‌తో కొందరు మీరు ఇక్కడ ఉన్నారు అని దేశములు విడిచిపెట్టివచ్చాము. కాని ఇప్పుడు మీరు వెళ్ళిపోతున్నారు. మేము ఉండిపోతున్నాము అన్నారు. అప్పుడు భగవాన్ వారితో పూర్వం ఏదో జన్మలో సంబంధము లేకుండానే మనం ఇక్కడ కలిసామా, ఈ సంబంధము మనలను వేరొకచోట కలపదా అన్నారు.

దేహము పడిపోయిన వెంటనే బంధువులతోటి, స్నేహితులతోటి, పరిసరములతోటి ఉన్న సంబంధము తెగిపోతుందిగాని గురువుతో ఉన్న సంబంధము తెగదు. గురువుతో ఉన్న సంబంధము ఎటువంటిది అంటే మనం కనబడని సంకెళ్ళతో బంధింపబడి ఉంటాము. ఆయన అనుగ్రహము నుండి తప్పించుకొనే అవకాశము లేనేలేదు. జన్మజన్మలకు మనకూడా వస్తూ ఉంటాడు. ఈ దేహము మరణించి అహంకారమునకు వేరొక దేహము వచ్చినప్పటికి వాడు ఎక్కడ ఉన్నాడు, ఏమి చేస్తున్నాడు, వాడిని ఏ విధంగా సంస్కరించాలి, ఏవిధమైన సమర్థత కలుగజేయాలి అని గురువు చూస్తూ ఉంటాడు. బ్రహ్మానుభవం కలుగకుండా ఏ వాసనలు అడ్డువస్తున్నాయో చూసి వాటిని తగ్గిస్తూ, వాడిని తయారుచేసి టైము చూసి వాడిని హృదయంలోనికి గుంజుకుంటాడు. వాడి జీవలక్షణములను తీసుకొని ఆయన స్వరూపముతో వాడిని అలంకరిస్తాడు.

గురువు యొక్క అనుగ్రహము పొందితే తప్పనిసరిగా జ్ఞానం పొందటానికి అర్హుల మవుతాము. అలాగ ఆయన మనలను తయారుచేస్తూ ఉంటాడు. మన శరీరమును తలుపుసందునపెట్టి నొక్కితే ఎంద బాధగా ఉంటుందో అలాగ మనమనస్సును ఒకోసారి నొక్కుతూ ఉంటాడు. మనస్సును నొక్కితే గాని అది కక్కదు. మనస్సులో ఉన్న వాసనలను తీసివేయటం కోసం అటువంటి సన్నివేశాలను కల్పిస్తూ ఉంటాడు. గురువు యొక్క ఆగ్రహము కూడా అనుగ్రహము అని భావించిన శిష్యుడు అదృష్టవంతుడు.

గురువుయొక్క అనుగ్రహమునకు పాత్రుడవయినపుడు తప్పక జ్ఞానము నిన్ను వరిస్తుంది. ఆయన దగ్గర జ్ఞానం తప్పించి ఏమీలేదు అందువలన ఇచ్చేది అదే. మనకు ఏది మంచిదో మనకంటే ఎక్కువగా గురువుకు తెలుసు. అది మనకు ఇచ్చేవరకూ జన్మజన్మలకు వెంటాడుతూ ఉంటాడు. మనకు ఆత్మానుభవం కలిగేవరకూ మనలను విడిచి పెట్టడు. వాడు గురువు.

మనం ఏ మనిషినీ తిరస్కార బుద్దితో చూడకూడదు. మనం తిరస్కారబుద్ధితో చూస్తే మనస్సు బాహ్యముఖంలోనికి వెళ్ళిపోతుంది. దేహ ప్రారబ్దమును బట్టి చదువు, డబ్బు, గౌరవము ఉండవచ్చును. ఇది అంతా మాయ. వీటిని చూసి అహంకారము తెచ్చుకుంటే అవి ఎలాగూ పోతాయి చివరకు అహంకారము పెరిగిపోతుంది.

వినయం జ్ఞానమును సంపాదించిపెడుతుంది. అవినయం మనిషిని జ్ఞానమునకు దూరం చేస్తుంది. మనకు బాహ్యమైన శక్తులు ఏమైనా ఉన్నప్పటికి వాటివలన అవినయం రాకుండా చూసుకోవాలి. భౌతికమైన శక్తులు ఉన్నామనం అణిగి ఉండాలి. వినయం చాలా ముఖ్యము. ఎవడికైతే వినయం ఉందో ఆ మనిషిని జ్ఞానం వరిస్తుంది. మనం జీవితం పొడుగునా అవినయం రాకుండా కాపాడుకోవాలి.

మనం సింపుల్‌గా ఉండటం నేర్చుకోవాలి. మన మాట, తలంపు, నడక అన్నీ సింపుల్‌గా ఉండాలి.

ఎందుకంటే నీ హృదయంలో ఉన్న నిజం సింపుల్‌గా ఉంది అన్నారు భగవాన్. దైనందిన జీవితములో నీ ప్రవర్తన సింపుల్‌గా ఉండాలి అంటున్నారు భగవాన్. ఆడంబరముగా ఉంటే ఖర్చులు పెరుగుతాయి. సింపుల్‌గా ఉంటే ఖర్చులు తగ్గుతాయి. భౌతిక దృష్టితో చూసినా దీనివలన ప్రయోజనం ఉంది. జ్ఞానం కూడా కలుగుతుంది. అన్నీ ఉన్నా కూడా అణిగి ఉండాలి. బడాయి మాటల వలన జ్ఞానం కలుగదు. మనస్సు పవిత్రం అయినపుడు జ్ఞానము పొందటానికి యోగ్యత కలుగుతుంది.

భగవంతుని మీద ఎవరూ నెపం వేయవద్దు. మనం జ్ఞానమును సంపాదించే అంత ఎత్తు ఎదిగితే, ఆయోగ్యతను సంపాదిస్తే ఒక్కక్షణం కూడా భగవంతుడు ఆగడు. కాలయాపన చేయడు. మనం ఆ ఎత్తుకు ఎదగటానికి భగవంతుడు చూస్తున్నాడు. ఆస్థాయికి చేరిన మరుక్షణంలో జ్ఞానముతో మనలను అలంకరిస్తాడు. ఆయన ఆలస్యము చేయడు. మనం సహనమును, సమర్థతను నేర్చుకోవాలి. జీవితంలో విలువలు పెంచుకోవటం కూడా చదువులో ఒకభాగమే. హృదయంలో ఉన్న సత్యమును అందుకోవటానికి మనం చేసే ప్రయత్నం కూడా చదువులో ఒకభాగమే. ఏదో ఒక విషయంలో నేర్పును సంపాదించటం మాత్రమే చదువు అని అనుకోవద్దు. మనం ఎవరిమో మనం తెలుసుకావటానికి ఉపయోగపడేది కూడా చదువే. వాడు చేసే పనిలో నేర్పు సంపాదించటమే కాకుండా మానసికంగా కూడా ఎదుగుతూ ఉండాలి. మనస్సులో ఉన్న ఇరుకు భావాలు తగ్గుతూ ఉండాలి.

నాకు జ్ఞానం కావాలి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. జ్ఞానంకావాలి అని మనం కూడా యాంత్రికంగా అంటాము గాని మనకు అక్కరలేదు. అందరూ అంటున్నారు అని మనం కూడా అంటాము. మనం నిజంగాజ్ఞానమును కోరుకొంటున్నామా, లేదా అనేది పరమేశ్వరుడు చూస్తూ ఉంటాడు. ఈ లోకంలో జ్ఞానం ఎవరికీ అక్కరలేదు ఎందుకంటే జ్ఞానం విలువ ఎవరికీ తెలియటం లేదు అన్నాడు అయిన్‌స్టీన్. జ్ఞాన సముపార్జన కోసం అవసరమైతే ప్రపంచము యొక్క అంచుల దాకా ప్రయాణం చెయ్యి అని అయిన్‌స్టీన్ చెప్పాడు. జ్ఞానం కావాలి అని భగవాన్‌ను అడిగితే నీలోపల ఉండి జ్ఞానం కావాలి అని ఎవరు కోరుకొంటున్నారు అన్నారు భగవాన్. నేను అని చెపుతున్నాడు. ఆనేను అని చెప్పే నేను ఎవడో తెలుసుకో. అది తెలుసుకొన్నాక కూడా జ్ఞానము కావాలి అంటే అప్పుడు చూద్దాము అంటున్నారు భగవాన్. ప్రతీ మనిషి నేను, నేను అంటాడు. ఈ నేను, నేను అనే నేను ఎవడు అని ప్రశ్నించుకోవాలి. దానికి సమాధానం దొరికితే జ్ఞానం కలుగుతుంది.

మోక్షమును పొందటం కోసం మరణానంతరము అబద్ధమైన నేనును గురువు సహాయంతోనో, ఏ దేవతల సహాయంతోనో స్వర్గలోకంలోనూ, కైలాసంలోనూ త్రిప్పుదామని చూస్తూ ఉంటారు. ఏ నేనును అయితే స్వర్గములోనూ, కైలాసములోనూ త్రిప్పుదామని చూస్తున్నావో దాని నుండి విడుదల పొందటమే మోక్షము అన్న సంగతి ఎప్పుడు తెలుస్తుంది, ఎవరు చెపుతారు అంటున్నారు భగవాన్. ఈ తప్పుడు ఆలోచన నుండి విడుదల పొందాలి. మరణించిన తరువాత జీవుడిని తీసుకొని వెళ్ళి ఎక్కడో కూర్చోబెడదామని చూస్తున్నావు. అసలు జీవలక్షణాల నుండి మొదట విడుదలపొందాలి.

భ్రమలో ఉన్న మనిషికి బ్రహ్మం తెలియ బడదు అని బాబాగారు పదేపదే చెప్పేవారు. పుస్తకాలు చదివితే భ్రమపోదు. విచారణ చేసి హృదయం యొక్క లోతులలోనికి దిగి దాని వేరును కత్తిరిస్తే భ్రమపోతుంది

గాని పుస్తకాలలో ఈదటం వలన భ్రమపోదు. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. కాని ఆయనకోసం మనం బయట వెతుకుతాము. పూజలు, జపాలు, యాత్రలు చేయమంటే చేస్తారు గాని హృదయంలో ఎవరూ వెతకరు. బయట దేవుని వెతకటం కోసం ఎంత కష్టపడుతున్నామో అంత కృషి చేసి మనస్సును అంతర్ముఖం చేస్తే భగవంతుడు వ్యక్తమవుతాడు.

నేను అనేది బంగారము కాకపోయినా మనకు బంగారము లాగ కనబడుతోంది. నేను అనేది ఇత్తడిలాగ కనబడితే ప్రతీ జీవుడూ దానిని బయట పారవేసేవాడు. కాని అది బంగారములాగ కనబడుతోంది. అందువలన దానిని వదలటంలేదు. హృదయంలో దేవుడు ఉన్నాడు అని చెపుతున్నారు. వాడు కనబడటంలేదు. కనబడని దేవునికోసం బంగారంలాగ కనబడే నేనును ఎలా వదిలేసుకొంటాము. సృష్టిలో ఎందుకు పనికిరానిది ఏదైనా ఉంది అంటే అది నేనే. కాని మానవుడు దానికోసమే బ్రతుకుచున్నాడు. ఈనేనుకు గాయం తగిలితే కుటుంబ సభ్యులను కూడా వదలివేస్తాడు. మనం సాధన పేరు మీద నేనును పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయటంలేదు. దానిని అలంకరిస్తున్నాము. అది మనం చేసే పొరపాటు. నేనును తిరస్కరించాలి.

ప్రపంచములో కొన్ని విషయముల పట్ల ఇష్టత కలుగుతుంది, కొన్ని విషయముల పట్ల అయిష్టత కలుగుతుంది. ఇష్టతవల్లరాగం, అయిష్టత వల్ల ద్వేషం కలుగుతుంది. ప్రపంచములో అనేక విషయాలు ఉన్నాయి, అనేక సంఘటనలు జరుగుతున్నాయి. నీకు ఉదాసీనంగా ఉండటం అలవాటు లేదు. కాని సాధకుడు ఉదాసీనుడుగా ఉండాలి. ప్రతీ దానికి తీర్పు చెప్పటానికి అలవాటు పడతాము. ఆ విషయం ఏమిటో తెలియకుండానే తీర్పు చెపుతాము. తీర్పు చెప్పటానికి కోర్టులు ఉన్నాయి. ప్రతీదానికి నీవు బుర్రను పాడుచేసుకొంటావు ఎందుకు అనే వారు భగవాన్. ప్రపంచము అన్నాక మంచీ ఉంటుంది, చెడ్డా ఉంటుంది. అది ఈశ్వరుడు చూసుకొంటాడు. ఈ సృష్టి నీది కాదు ఈశ్వరుడిది. అంతా ఆయన చూసుకొంటాడు. ప్రతీ విషయంలోనికి వెళ్ళి నీ బుర్రను పాడుచేసుకోవద్దు. నీ అన్వేషణ ఏమిటో అది చూసుకో.

మనం ఎవరినీ ద్వేషించకూడదు. మన స్వార్థం కోసమైనా ఇతరులను ద్వేషించ కూడదు. ప్రమాదం ఎక్కడ ఉంది అంటే మనం ఎవరినైతే ద్వేషిస్తున్నామో వారే ఎక్కువగా జ్ఞాపకంవస్తారు. ఎవరినైనా ద్వేషిస్తే మనమనస్సు వెళ్ళి అక్కడ వాలుతుంది. దేవుడు జ్ఞాపకంరాడు. వాడే జ్ఞాపకం వస్తాడు.

మనస్సులో పాపం లేకపోతే, దోషం లేకపోతే మనస్సుకు తిరుగుడుతో పనిఏముంది. మనస్సు ఎక్కడికైనా పరిగెడుతూ ఉంటే అక్కడ బంధము ఉన్నట్లు గుర్తు. బంధం కారణంగానే మానవుడు పొరపాటు చేస్తాడు. పొరపాటు చేసాడు అంటే అక్కడ బంధము ఉంటుంది. బంధమును బట్టే మనస్సుకు చపలత్వము వస్తుంది.

నీవు ఆత్మస్థితిని పొందేవరకూ, ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు ఎరుక పడేవరకూ రాగద్వేషములు నిన్ను విడిచిపెట్టవు. ఏజన్మ కాజన్మ నిన్ను వెంటాడుతూ ఉంటాయి. ఉన్నవస్తువు నీకు అనుభవంలోనికి వచ్చే వరకూ ఏదో విషయం వైపుకు మనస్సు ఆకర్షింప బడుతుంది. ప్రకృతికి సంబంధించిన బెడదలు తప్పవు. బాహ్య విషయములు నిన్ను బాధిస్తూనే ఉంటాయి. దృశ్యములు ఎప్పుడైతే నివారించ బడినాయో ఆ క్షణంలో ఉన్న వస్తువు నీకు తెలియబడుతుంది.

బాహ్య విషయములతో నీకు ఉన్న అనుబంధము కూడా తాత్కాలికమే. బాహ్య విషయముల నుండి

ఆనందము వచ్చినట్లు అనిపించిన అది సహజమైనది కాదు. అది కేవలము కృత్రిమమైనది. పైగా అది పరిణామంలో దుఃఖమునకు దారితీస్తుంది. కాని హృదయంలో ఉన్న ఆనందము సహజమైనది. అది నీకు అందినపుడు నిన్ను ఒక్కక్షణంకూడా విడిచిపెట్టదు అది తెగింపులేని ఆనందము. దేహము పోయినా ఆ ఆనందము కొనసాగుతూనే ఉంటుంది. అది అభవసుఖము. అదినీకు అందినపుడు సృష్టికర్త వచ్చి నీకు ఎదురుగా నిలబడినా చూడాలని నీకు అనిపించదు. వారి మీద ఇష్టం లేకకాదు. చూడాలనే కోరికరాదు.

నీలో అహంకారము పొంగకుండా ఉండటానికి అనేక ఉపాయములు చెప్పారు ఆహారనియమము చాలాముఖ్యమైనది. సాత్వికాహారంతినాలి. అదికూడా మితంగానే తినాలి. ఆహారముయొక్క ప్రభావము దేహముమీద, మనస్సుమీద చాలా ఉంటుంది. ఎవరి శరీరమును వారు చూసుకొని పొంగిపోతున్నారు. మనం తిన్న ఆహారమే ఇలా మారుతోంది. ఇది తెలియక మనలను మనం చూసుకొని పొంగిపోతున్నాము. ఈ శవాన్ని చూసుకొని పొంగిపోతున్నావు ఏమిటి అంటున్నారు భగవాన్. దేహమునకు చాలా ప్రాముఖ్యత ఇస్తున్నావు. నీవు ఎంత ప్రాముఖ్యత ఇచ్చినా స్మశానంతో ఈ దేహయాత్ర ముగిసిపోతుంది. ఈ దేహమునకు ఇచ్చే విలువలో కొంతైనా మరణానంతరము నీకూడా ప్రయాణించే మనస్సుకు ఇయ్యి. దేహారోగ్యమును బాగుచేసుకోవాలి అని ఎలా అనుకొంటున్నావో అలాగ మరణానంతరము నీ కూడా ప్రయాణించే మనస్సును బాగుచేసుకోవటానికి కొంత శ్రద్ధ తీసుకో అని చెపుతున్నారు. యోగాభ్యాసములు కూడా చెప్పారు. యోగం అంటే ఐక్యమవ్వటం. మనస్సును బ్రహ్మములో ఐక్యము చేయటమే యోగం యొక్క ప్రయోజనము. భక్తి యోగము, ధ్యానయోగము, కర్మయోగము ఇలా ఏదో ఒక యోగమును అవలంభించి నీవు గమ్యమును చేరుకో. అతిగా మాట్లాడకూడదు. దీని వలన శక్తి వృధా అవుతుంది. హితవు గా మాట్లాడాలి. మితంగా మాట్లాడాలి. ఏదైనా చెప్పేటప్పుడు ఎదుటి మనిషి ఏ స్థాయిలో ఉన్నాడో ఆస్థాయికి దిగి చెప్పాలి. టీచింగ్ అంటే అది. చెప్పేవాడికి వినేవాడి మీద ప్రేమ ఉండాలి. ప్రేమ లేకపోతే వాడిస్థాయికి మనం దిగలేము. ప్రేమ లేకపోతే టీచింగ్ అంతా యాంత్రికముగానే ఉంటుంది. మాటలో ఏమివస్తుంది అనుకొంటాము. మాట వలనకూడా పుణ్యం వస్తుంది. ఎక్కడ ఏది మాట్లాడాలి, ఎంతవరకూ మాట్లాడాలి అని ఆలోచించుకొని మాట్లాడాలి. మనమాటను భగవంతుడు చూడడు. ఏ ప్రేరణ వలన మాట్లాడుతున్నాము అని ఆప్రేరణను చూసి భగవంతుడు మన ఆధ్యాత్మిక అభివృద్ధికి అవకాశం ఇస్తాడు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి నిద్ర కూడా అడ్డు. కలత లేని నిద్ర అయితే 6 గంటలు సరిపోతుంది. ఎక్కువ సేపు నిద్రపోవటం వలన కాలం వృధా అవుతుంది.

మరణించిన తరువాత ఏమౌతాము అని బుద్ధుని అడిగితే మరణానంతరము ఎవడైతే ఉంటాడు అని అనుకొంటున్నావో ఒక్కసారి రవ్వంత, ముల్లంత విచారణచేస్తే ఇప్పుడు కూడా వాడు లేడు అని నీకు తెలుస్తుంది అని బుద్ధుడు చెప్పాడు.

దేవుడు ప్రతీ మనిషిలోనూ ఉన్నాడు. కాని ప్రతీ మనిషి దేవునిలోలేడు. మనిషికి దుఃఖము రావటానికి కారణం ఇదే. ప్రతీ మనిషి దేవునిలో ఉండటం నేర్చుకుంటే వాడికి దుఃఖముతో ఉన్న సంబంధము తెగిపోతుంది. ఇదే యోగము.

**(జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 18-8-95)**